
ప్రజాశక్తి

శనివారం 2 సెప్టెంబర్ 2023 5

విజయనగరం



సిపిఎస్ రద్దుచేయాలని నిరసన

ప్రజాశక్తి-రామభద్రపురం


సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్‌ను తక్షణమే పునరుద్ధరించాలని ఫ్యాప్టో నాయకులు జెసి రాజు ఆధ్వర్యాన ఉపాధ్యాయులు నల్లరిబ్బన్లు ధరించి ప్లకార్డులతో నిరసన చేపట్టారు. సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రత్యామ్నాయంగా జిపిఎస్‌ను తెస్తామని ప్రభుత్వం చెపుతున్నా ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో సభ్యులు నాగభూషణం, కృష్ణంనాయుడు, రెడ్డి వేణు, శివున్నాయుడు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో సభ్యులు

విద్యుత్తు కోత.. ఛార్జీల మోత

ఓవైపు విద్యుత్తు కోతలు... మరోవైపు ఛార్జీల మోత వెరసి ప్రజానీకాన్ని ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఏప్రిల్ 1 నుంచి వివిధ రూపాల్లో ఛార్జీలను పెంచిన ప్రభుత్వం వారం రోజులుగా ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ పేరిట విద్యుత్తు కోతలు ప్రారంభించడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. డబ్బుపోయే... సుఖమూ లేకపోయే అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం బరితెగించిందంటూ జనం అగ్గిమీద గుగ్గిలమౌతున్నారు.



- జిల్లాపై నెలకు రూ.24 కోట్ల భారం
- అయినా తప్పని ఉక్కపోత
- ప్రభుత్వం బరితెగించిందంటున్న ప్రజానీకం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం ఉమ్మడి జిల్లాలో 8,11,017 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో గృహాలకు 6,71,921, వాణిజ్యం 68,939, ప్రభుత్వ కార్యాలయాలకు 15,321, వ్యవసాయ పంపుసెట్‌లకు, 52,082 ఉన్నాయి. వీటన్నింటికీ ఎపిఇపిడిసిఎల్ ద్వారా విద్యుత్ సరఫరా అవుతోంది. వినియోగదారులంతా ఎప్పటి బిల్లులు అప్పుడే చెల్లిస్తున్నారు. ఒక వేళ గడువు తేదీలోపు చెల్లించకపోతే ఫీజులు పీకేసి మరీ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. అయినప్పటికీ లెక్కలు వేశాక వినియోగదారులు చెల్లించిన డబ్బులు విద్యుత్తు ఉత్పత్తికి, పంపిణీ తదితర ఖర్చులకు సరిపోలేదంటూ సర్ ఛార్జీల పేరిట అదనంగా వసూలు చేస్తున్నారు. మరే సంస్థలోనూ లేని విధంగా విద్యుత్ పంపిణీ సంస్థల్లోనే ఇటువంటి విధానం అమలవుతుంది. ఈనేపథ్యంలో నాణ్యమైన కరెంటు నిరంతరం సరఫరా చేయాల్సిన ప్రభుత్వం వేలాపాలా లేకుండా విద్యుత్ కోతలకు పాల్పడుతోంది. పట్టణాలు, గ్రామాలు, రాత్రి పగలు అన్న తేడా లేదు. అన్ని చోట్లా సమయంతో సంబంధం లేకుండా రోజుకు 4 నుంచి 5గంటల పాటు విద్యుత్ కట్ చేయడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అసలే ఎండలు వేసవికాలాన్ని తలపిస్తున్నాయి. ఉక్కపోత, వేడి చాలా ఎక్కువగా ఉంది. ఈనేపథ్యంలో రాత్రివేళల్లో కట్ చేయడం వల్ల నిద్రాభంగం ఏర్పడుతోంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు తీవ్ర అస్థలు పడుతున్నారు. పగటిపూట విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో వ్యవసాయ పంప్ సెట్లకు నుంచి సాగునీరు అందని పరిస్థితి. అసలే వర్షాభావం వెంటాడుతోంది. ఈనేపథ్యంలో అక్కడక్కడ విద్యుత్ బోర్ల సాయంతో ఉబాలు పడుతున్నారు. విద్యుత్ అంతరాయం వల్ల నాట్లకు ఆటకం కలుగుతోంది. కార్యాలయాల్లో గంటల తరబడి విద్యుత్ లేకపోవడంతో కప్యూటర్లతో పనిచేయడం సాధ్యపడడం లేదు. ఇక పట్టణ ప్రాంతాల్లో మిగిలిన సమయాల్లో ముఖ్యంగా హోటళ్లు, ఇళ్లల్లో పిండిరుబ్బు వేసేందుకు ఆటకంగా మారింది. సమయానికి విద్యుత్ లేకపోవడంతో ఇళ్లలో నీరు లేక, సకాలంలో ఆఫీసులకు, ఇతర పని ప్రదేశాలకు బయలుదేరలేని పరిస్థితి దాపురిస్తోంది. నెట్, జిరాక్స్ వంటి దుకాణాలు, షాపులు నడుపుతున్నవారు ఉపాధి కోల్పోవాల్సిన దుస్థితి దాపురిస్తోంది.

సర్దుబాటు ఛార్జీలు ఇలా

విద్యుత్తు భారాలు మోపేందుకు మాత్రం ఢోకా లేదు. 2014 నుంచి 19వరకు వినియోగించుకున్న విద్యుత్‌కు చెల్లించిన బిల్లులు సరిపోలేదంటూ రాష్ట్ర వ్యాప్తంగా రూ.2,900 కోట్లమేర సర్దుబాటు భారం మోపింది. జనం నుంచి మూడేళ్లపాటు వసూలు చేయడానికి విద్యుత్ ఛార్జీల నియంత్రణ మండలి ద్వారా విద్యుత్ పంపిణీ సంస్థలు ఆమోదం పొందాయి. ఇప్పటికే యూనిట్‌కు 20పైసలు చొప్పున 11నెలల పాటు వినియోగదారులు చెల్లించారు. మరో 25నెలలపాటు ఇంకా చెల్లించాల్సివుంది. ఇది చాలదన్నట్టుగా 2021 -22 ఆర్థిక సంవత్సరంలో వినియోగించిన విద్యుత్ బిల్లులకు చెల్లించిన మొత్తం సరిపోలేదంటూ మరోసారి 20పైసలు చొప్పున సర్దుబాటు ఛార్జీలు మోపుతున్నారు. పాత, కొత్త సర్దుబాటు ఛార్జీలు 40పైసలు మోయడమే వినియోగదారులకు అత్యంత కష్టతరంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో విద్యుత్ భారాన్ని తగ్గించాల్సిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు పడుతున్న భారాలకు ఎప్పటి వరకో ఎందుకు ఆగాలి అంటూ మరుచటి నెలలోనే సర్దుబాటు ఛార్జీలు వసూలు చేయాలని ఆదేశించింది. మోడీ ఆదేశాలే తడవుగా జగన్ సర్కారు ఏప్రిల్ నెలలో చెల్లించిన డబ్బులు సరిపోలేదని మరో 40పైసలు వసూళ్లకు సిద్ధపడింది. ఈ లెక్కన కేవలం సర్దుబాటు ఛార్జీ రూపంలోనే 80పైసలు భారం పడుతోంది. జిల్లాలో రోజుకు సుమారు కోటి యూనిట్ల వినియోగం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వాసులపై నెలకు రూ.80లక్షల వరకు భారం పడుతోంది. ఏడాదికి రూ.24కోట్ల పైమాటే భారం. దీనికితోడు నెలవారీ వినియోగపు బిల్లు, ఫిక్స్‌డ్ ఛార్జీ, కస్టమర్ ఛార్జీ, ట్రూ అప్ ఛార్జీ తదితరాల రూపంలో అధిక మొత్తంలో బిల్లులు విధించారు. 20 నుంచి 30 యూనిట్లు వినియోగించిన సామాన్య కుటుంబాలకు వేల రూపాయల బిల్లులు వస్తున్నాయి. దీంతో, గత నెలతో పోలిస్తే రెట్టింపు స్థాయిలో బిల్లులు వచ్చాయంటూ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు ఛార్జీకన్నా ఇలా కొసరుగా విధిస్తున్న ఛార్జీలే అధికంగా ఉన్నాయి. దీంతో, తమకు అర్థం కాకుండా కొత్తకొత్త రూపాల్లో ఛార్జీలు పెంచి తమను మోసం చేస్తున్నారని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్తు కోతతో ఆసుపత్రి పాలవుతున్నాం

ప్రభుత్వం విధించిన విద్యుత్ కోతలవల్ల ఆసుపత్రుల పాలవుతున్నాం. రాత్రిపూట దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. వాటి బారిన పడడం వల్ల తన ఇద్దరు పిల్లలూ జ్వరం బారినపడ్డారు. ఆసుత్రులకు తీసుకెళ్తే రూ.వేలు ఖర్చు అయ్యాయి. ఫ్యాన్లు తిరిగేందుకు అవకాశం లేక ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాం. ఇంతలా ఛార్జీలు మోపి, ఇబ్బందులకు గురిచేయడం ప్రభుత్వానికి తగదు.

బోనుమద్ది భారతి, ఆకులకట్ట గ్రామం, బాడంగి మండలం

ముందుచూపు లేకే విద్యుత్తు కోతలు



బొబ్బిలి : విద్యుత్తు సరఫరాపై ప్రభుత్వానికి ముందుచూపు లేక పోవడంతోనే అప్రకటిత కోతలు విధిస్తున్నారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్తు కోతలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో విద్యుత్తు కోతలను చూస్తే ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. విద్యుత్తు కోతలతో ప్రజలు అల్లాడుతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని మండిపడ్డారు. విద్యుత్తు కోతలు నివారించి నిరంతరాయంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

విద్యుత్తు కోతలు అన్యాయం

బొబ్బిలి : వేళాపాలా లేకుండా విద్యుత్తు కోతలు విధించడం దుర్మార్గమని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు అన్నారు. కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్తు కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాత్రి సమయాల్లో విద్యుత్తు కోతలు విధించడంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారని తెలిపారు.

ఉత్తమ గురువులకు గుర్తింపు

ముగ్గురు ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయి అవార్డులు

ప్రజాశక్తి-రేగిడి, తెర్లాం, గుర్ల

విద్యారంగంలో ఉత్తమ సేవలు అందించిన జిల్లాలోని ముగ్గురు ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. వారిలో రేగిడి ఆముదాలవలస జెడ్‌పి హైస్కూలులో స్కూలు అసిస్టెంట్(బయోలజి)గా పనిచేస్తున్న బి.ఉమామహేశ్వరి, గుర్ల మండలం పెద బంటుపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న జట్ల పైడిరాజు, తెర్లాం మండలం వెలగపూడి జెడ్‌పి హైస్కూలు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుడు జెబి ధనుంజయనాయుడు ఉన్నారు.

22 ఏళ్లుగా ఆన్‌లైన్ తరగతులు



గత 22 సంవత్సరాలుగా డిజిటల్ టెక్నాలజీని విస్తతంగా వినియోగిస్తూ 6 నుంచి 10వ తరగతి వరకు వర్చువల్, ఆన్‌లైన్ తరగతులను నిర్వహించడం వల్ల రేగిడి ఆముదాలవలస జెడ్‌పి హైస్కూలు స్కూలు అసిస్టెంట్ బి.ఉమామహేశ్వరి రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. ఎన్నో వైజ్ఞానిక ప్రదర్శనలు చేపట్టారు. ఈ వార్డు విద్యార్థులకే అంకితమని ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తికి తెలిపారు. అతి తక్కువ ఖర్చుతో ఉపయుక్తమైన భోధనా భ్యాసన సామగ్రిని తయారు చేస్తున్నట్లు తెలిపారు. గత రెండేళ్లగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగపడే 114 అంశాలను 'ఉమా సైన్స్ గురు' అనే యూట్యూబ్ ఛానల్ ద్వారా రూపొందించినట్లు తెలిపారు. విద్యార్థులు బైజూస్ కంటెంట్ టాబ్స్‌లో వీక్షించే విధంగా ప్రోత్సహించామన్నారు. విద్యార్థులు భవిష్యత్తు శాస్త్రవేత్తలు గా మారే విధంగా జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో జరిగే వివిధ సైన్స్ కార్యక్రమాల పోటీలలో పాల్గొనే విధంగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థుల్లో ప్రతిభా పాటవాలకు గుర్తింపు



విద్యార్థుల్లో ప్రతిభా పాటవాలను పెంపొందించేందుకు చేసిన కృషికి గుర్తింపుగా తనకు రాష్ట్రస్థాయి అవార్డు దక్కినట్లు వెలగవలస జెడ్‌పి హైస్కూలు హెచ్‌ఎం జె బి ధనుంజయనాయుడు తెలిపారు. ఈయన పాచిపెంట మండలం కొత్తవలసలో 2012 నుంచి 17 వరకు, అలజంగిలో 2017 నుంచి 2023 వరకు పనిచేశారు. ప్రస్తుతం వెలగవలసలో విధులు నిర్వహిస్తున్నారు. ఏ పాఠశాలలో పనిచేసినా పాఠశాల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు పేద విద్యార్థులకు తన వంతు సాయం అందిస్తున్నారు. పాచిపెంట మండలం కొత్తవలస యుపి స్కూల్లో పనిచేస్తున్నప్పుడు గ్రామ పెద్దలు సహకారంతో హై స్కూల్ గా మార్చడంలో కృషి చేశారు. ఎస్‌సి విద్యార్థులను ఆర్థికంగా చేయూతనిచ్చి ఉన్నతమైన స్థితిలోకి తీసుకువెళ్లడంలో ఆయన కృషి ఉంది. పూర్వ విద్యార్థి ఎడ్డి గోవింద విద్యార్థితో కంప్యూటర్ రూమ్‌ను పాఠశాలలో ఏర్పాటు చేయించారు. ఇలా అనేకమైన కార్యక్రమాలు చేపట్టినందుకు ఆయనకు అవార్డు లభించింది.

పాఠశాల అభివృద్ధిలో కీలకపాత్ర



గుర్ల మండలం పెదబంటుపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జిటిగా పనిచేస్తున్న జె.పైడిరాజు ఎక్కడ విధులు నిర్వహించినా అక్కడ పాఠశాల లభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. గతంలో మండ, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. 2009 నుంచి 2017 వరకు మండలంలో లవిడాం ఎంపిపి స్కూల్ లో విధులు నిర్వహించారు. ఆ గ్రామం నుండి ప్రైవేటు స్కూల్‌కు వెళ్తున్న 40 విద్యార్థులను దఫ దఫాలుగా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. పాఠశాలను ప్రయివేటు స్కూల్ కు ధీటుగా రూపుదిద్దారు. విద్యార్థులకు కావాల్సిన నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, ప్లాంకులు ఏటా అందిస్తున్నారు. గ్రామస్తుల సహకారం తో పాఠశాలకు వాటర్ ట్యాంక్, టాయిలెట్స్‌కు రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించారు. గ్రామం లో డ్రాపౌట్స్ లేకుండా కృషి చేస్తున్నారు. పాఠశాల ఆవరణలో సరస్వతి దేవి, గాంధీజీ విగ్రహాలను ఏర్పాటు చేశారు.

కోడి కత్తి డ్రామా వైసిపిదే

టిడిపి నాయకులు కిమిడి నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరం కోట

కోడికత్తి కేసులో తెలుగుదేశం పార్టీ తనపై కుట్ర చేస్తున్నట్లు జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. శుక్రవారం అశోక్‌బంగ్లాలో విలేకర్లతో మాట్లాడుతూ కోడికత్తి కేసులో జెడ్‌పి చైర్మన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఆ వ్యాఖ్యలు చేసిన న్యాయవాది కోసం మాట్లాడటం మానేసి టిడిపని ఇందులోకి లాగడమేమిటని ప్రశ్నించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న జంపల్లి శ్రీనివాసరావుకి ఎన్‌ఒసి ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని, ఓ దళిత యువకుడు నాలుగున్నర ఏళ్లుగా జైల్లో మగ్గిపోతున్నాడని గుర్తు చేశారు. పలు కేసుల్లో నిందితులుగా ఉన్న జగన్, అవినాష్ మాత్రం బెయిల్ మీద తిరుగుతున్నారని విమర్శించారు.కోడి కత్తి కేసులో ముఖ్యమంత్రి జగన్ ఎందుకు న్యాయస్థానానికి వెళ్లడం లేదని ప్రశ్నించారు. కోడి కత్తి డ్రామా ఆడినది వైకాపాయేనని, దీన్ని తెదేపా మీద నెట్టి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో వైసిపి పాలనతో ప్రజలంతా విసిగిపోయారని.. జగన్‌మోహన్‌రెడ్డిని ఎంత త్వరగా గద్దె దించాలో ఎదురు చూస్తున్నారని అన్నారు. ఉమ్మడి విజయనగరంలో సీట్లన్నీ తామే గెలుస్తామని వెల్లడించారు. సమావేశంలో పార్టీ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, అరకు పార్లమెంటు ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకటనాయుడు, బొద్దుల నర్సింగరావు, గంటా పోలినాయుడు, ఆల్తి బంగారుబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు నాగార్జున


రైతు ఆనందమే లక్ష్యం

- జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు
- 2,603 మంది కౌలు రైతులకు రైతు భరోసా సాయం
- 182 మంది రైతులకు పంట నష్టపరిహారం

ప్రజాశక్తి-విజయనగరం

రైతు ఆనందంగా ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. భూమి లేని పేదలకు కూడా ఆర్థిక సాయం అందించాలనే ఉద్దేశంతో సిసిఆర్‌సి కార్డులున్న కౌలు రైతులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందని గుర్తు చేశారు. సాధారణ కౌలు రైతులు, దేవాదాయ భూముల్లో సాగు చేసుకుంటున్న కౌలు రైతులకు రైతు భరోసా ఆర్థిక సాయం, మే, జూన్ నెలల్లో కురిసిన వర్షాలకు పంట నష్ట పోయిన రైతులకు పరిహారం చెల్లించే నిమిత్తం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నుంచి జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి.ఎస్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, డిసిసిబి ఛైర్మన్ చినరాము నాయుడు పాల్గొన్నారు.

అనంతరం జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. వరుసగా ఐదో ఏట తొలి విడతలో భాగంగా జిల్లా నుంచి 2,603 మంది కౌలు రైతులకు రూ.1.95 కోట్ల ఆర్థిక సాయాన్ని రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని వివరించారు. వారిలో దేవాదాయ భూముల్లో సాగు చేసుకుంటున్న కౌలు రైతులు ఐదుగురు ఉన్నారని వారికి కూడా ఆర్థిక సాయం అందిందని స్పష్టం చేశారు. వీరితో పాటు ఈ ఏడాది మే, జూన్ నెలల్లో కురిసిన వర్షాలకు 39.54 హెక్టార్లలో పంటకు నష్టం వాటిల్లిందని 182 మంది బాధిత రైతులకు రూ.9.88 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం విడుదల చేసిందని వివరించారు. అనంతరం కౌలు రైతులకు, పంట నష్టం వాటిల్లిన రైతులకు సంబంధిత మెగా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వీటీ రామారావు, ఉద్యాన శాఖ డిడి జమదగ్ని, పశు సంవర్థక శాఖ జెడి మల్లేశ్వరరావు, సెంట్రల్ బ్యాంకు డిఎం జగన్నాథం, వ్యవసాయ శాఖ ఎడి తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా జట్టు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖపట్నంలో శుక్రవారం నుంచి జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ (అండర్ -15) బాల బాలికల బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో విజయనగరం జిల్లాకు చెందిన కోచ్, మేనేజర్ తో సహా 11 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడాకారుల్లో బాలికల విభాగంలో ఎం.సంజన, ఎస్.దాక్షిణ్య, ఎండి నిశిధ్ ఫాతిమా, వై.రేనుశ్రీ, వై.హిమబిందు, బాలుర విభాగంలో ఎం.తరుణ్, సిహెచ్ .మేఘవర్ష, ఎ.అజయ్ చైతన్య, ఎం.చరణ్ తేజ్, కోచ్ జి.శ్రీనివాసరావు, మేనేజర్‌గా కె.అపర్ణ బాబా హాజరయ్యారు. ఈ పోటీలు ఈనెల 3వరకు జరుగనున్నాయి.

ప్రజా వ్యతిరేక విధానాలపై ధర్నాలు

పలు చోట్ల సంతకాల సేకరణ



బొబ్బిలిలో కరెంటు బిల్లులను దహనం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-విలేకర్ల బృందం

నిత్యావసర సరుకులు ధరలు తగ్గించాలని పెంచిన కరెంటు చార్జీల, ఉపసంహరించుకోవాలని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం సమరభేరీ మూడోరోజు శుక్రవారం కొనసాగింది. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా నిరసనలు కొనసాగాయి. **విజయనగరం టౌన్..** నగరంలోని 3, 4, 30, 35, 39, 40, 53 సచివాలయాల వద్ద ధర్నాలు చేశారు. 35వ సచివాలయం వద్ద సిపిఎం పార్టీ నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు, 40వ సచివాలయం వద్ద నాయకులు ఎ.జగన్మోహన్‌రావు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధానాలు ఫలితంగా నిత్యవసర సరుకులు ధరలు రోజు రోజుకూ పెరుగుతూ పేద మధ్యతరగతి ప్రజానీకానికి ఆర్థిక ఇబ్బందులకు కారణమవుతున్నాయని అన్నారు. ఇప్పటికే ప్రజలు పెరిగిన ధరలతో శతమతమవుతుంటే ఇవి చాలదన్నట్లు విద్యుత్ ఛార్జీలను కూడా పెంచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల నడ్డి విరుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బి.రమణ, వి.లక్ష్మిచ, వి.రామచంద్రరావు, సన్నిబాబు, జగదాంబ, కర్రి.రమణమ్మ , శాంత మూర్తి, రాజు తదితరులు పాల్గొన్నారు. తోటపాలెం వైఎస్ఆర్ కాలనీ, ఆర్అండ్‌బి రైతు బజారు వద్ద సిపిఎం నాయకులు జగన్మోహన్‌రావు ఆధ్వర్యాన సంతకాల సేకరణ చేపట్టారు. సచివాలయాల వద్ద జరిగిన ధర్నాలు అనంతరం అడ్మిన్ కార్యదర్శులకు వాటిని అందజేశారు. **బొబ్బిలిరూరల్** మండలంలో అలజంగి గ్రామ సచివాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకర్రావు, నాయకులు ఎ.ఆచారి, బి.శంకర్రావు పాల్గొన్నారు. **బొబ్బిలి** పట్టణంలో 30వ వార్డు సచివాలయం వద్ద కరెంటు కోతలు, ఛార్జీల భారంపై సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కరెంటు బిల్లులను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.గౌరి, కనకరాజు, సరోజినీ, సత్యవతి, ప్రజలు పాల్గొన్నారు. **రామభద్రపురం** మండల కేంద్రంలో సచివాలయం-2 వద్ద సిపిఎం నాయకులు బలస శ్రీను ఆధ్వర్యాన నిరసన తెలిపారు. కార్యక్రమంలో తౌడమ్మ, శ్యామల, నాగేశ్వరరావు, విజయ్ పాల్గొన్నారు. **రేగిడి** మండలంలోని ఉణుకూరు సచివాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. అనంతరం విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని, నిత్యావసర సరుకుల ధరలను అదుపుచేయాలని సచివాయంలో వినతి అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.త్రినాథరావు, పోరెడ్డి విశ్వనాథం, కె.తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు. **కొత్తవలస** మండల కేంద్రంలో పెరిగిన ధరలు, విద్యుత్తు ఛార్జీలపై సిపిఎం జిల్లా నాయకులు గాడి అప్పారావు ఆధ్వర్యాన సంతకాల సేకరణ చేపట్టారు. **గజపతినగరం** మండలంలోని పురిటిపెంట, గజపతినగరం సచివాలయాల్లో సిపిఎం ఆధ్వర్యాన వినతులు అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.లక్ష్మి, నాయకులు జి.శ్రీనివాస్, దాసరి సింహాద్రి, సూర్యనారాయణ, కృష్ణ, గోవింద, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు. **శృంగవరపుకోట** పట్టణంలోని సచివాలయం-4 వద్ద సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. అనంతరం సచివాలయ అడ్మిన్ కోటరావుకు వినతి అందించారు. కార్యక్రమంలో గమ్మెల సన్యాసిరావు, గెమ్మల సాంబ, సిదరి బుజ్జి, ఉత్తరాన శివ తదితరులు పాల్గొన్నారు. **మెంటాడ** మండలంలోని లోతుగెడ్డ, ఆంద్ర సచివాలయాల వద్ద సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు ఆధ్వర్యాన ధర్నాలు చేపట్టారు. కార్యక్రమంలో కార్యక్రమంలో జి.శ్రీరామ్, సిహెచ్ కృష్ణవేణి, ఎం.రమేష్, తదితరులు పాల్గొన్నారు.



గజపతినగరంలో నిరసన చేపడుతున్న సిపిఎం నాయకులు, ప్రజలు

అర్హతున్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

మేయర్ విజయలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని మేయర్ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. 8 డివిజన్లకు సంబంధించి 590 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. అనంతరం మాట్లాడుతూ అమ్మఒడి, ఆసరా, చేయూత, రైతు భరోసా, వాహన మిత్ర,విద్య కానుకలు, విద్యా దీవెన వంటి అనేక పథకాలను అందిస్తూ పేదలను ఆదుకునే రీతిలో పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయా యాదవ్, ఫ్లోర్‌లీడర్ ఎస్‌వివి రాజేష్, సహాయ కమిషనర్ ప్రసాదరావు, కార్పొరేటర్లు కంటుభుక్త తవిటి రాజు, వైసిపి నాయకులు ఎవర్ణ కుమారస్వామి, బొంగు భానుమూర్తి, టిపిఆర్ఒ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

40వ డివిజన్‌లో గడప గడపకూ..

40వ డివిజన్ కంటోన్మెంట్ బొగ్గుల దెబ్బ ప్రాంతం నుండి ప్రారంభమైన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో కోలగట్ల తమ్మన్న శెట్టి పాల్గొన్నారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల తీరును అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యల పైన ఆరా తీశారు. అర్హత ఉండి పథకాలు పొందలేని వారి వివరాలను తెలుసుకుంటూ అందుకు గల కారణాలను తెలుసుకున్నారు. స్థానిక కార్పొరేటర్ ధనలక్ష్మి, జోనల్ ఇన్చార్జి దూబే , వైసీపీ నాయకులు గాలి భాస్కరరావు, మురళి, డివిజన్ ఇంచార్జ్ వాసుదేవరావు, మహిళా అధ్యక్షురాలు నందిని, యువజన విభాగం అధ్యక్షుడు సురేష్ పాల్గొన్నారు.



నూతన పింఛన్లు అందజేస్తున్న మేయర్ విజయలక్ష్మి

కెజిబివిలో క్రీడా పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయ దుర్గ యూత్ సొసైటీ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా విజయనగరం కెజిబివి వసతి గృహంలో బాలికలకు క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు పాల్గొన్నారు. సంస్థ చైర్మన్ కేశవపట్నం జయలక్ష్మి చేతులు మీదుగా విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కేసలి అప్పారావు మాట్లాడుతూ విజయ దుర్గ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో రెండేళ్లుగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో 3వ డివిజన్ కార్పొరేటర్ వి.సత్యగౌరి, కెజిబివి ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

లక్షింపేట కేసు వాయిదా

ప్రజాశక్తి-వంగర

మండలంలోని లక్షింపేట ఘటన కేసు ఈనెల ఎనిమిదో తేదికి వాయిదా పడింది. లక్షింపేట ప్రత్యేక న్యాయస్థానంలో శ్రీకాకుళం కోర్టు జడ్జి శుక్రవారం విచారణ చేపట్టి వాయిదా వేశారు. మొత్తం 80 మంది నిందితులకు గాను 12 మంది మరణించారు. 20 మంది గైర్హాజరు కాగా, 48 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో సిఐడి డిఎస్‌పి భూపాల్ పాల్గొన్నారు. రాజాం రూరల్ సిఐ హెచ్.ఉపేంద్ర రావు, వంగర ఎస్ఐ ఆర్.జనార్దనరావు బందోబస్తు నిర్వహించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

ప్రజాశక్తి-గుర్ల

మండలంలో సదానందపురంలో ఫీల్డ్‌అసిస్టెంట్‌పై అదే గ్రామానికి చెందిన రెడ్డి రామలక్ష్మి అధికారులకు ఫిర్యాదు చేయడంతో గతంలో ఎపిడి విచారణ నిర్వహించారు. విచారణలో మస్టర్ వెరిఫికేషన్ చేయగా అందులో ఎటువంటి తప్పులు రుజువు కాకపోవడంతో ఫిర్యాదుదారుకు తెలియజేశారు. ఎపిడి ఇచ్చిన నివేదికపై ఎన్‌ఆర్‌ఇజిఎ కమిషనర్ ఆదేశాల మేరకు అంబుడ్స్‌మేన్ అన్నపూర్ణదేవి శుక్రవారం మరోసారి విచారణ చేపట్టారు. కార్యక్రమంలో ఎపిఒ కామేశ్వరరావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి-కొత్తవలస

ఉత్తరప్రదేశ్ పోలీసులు న్యాయవాదులపై లాఠీఛార్జీని వ్యతిరేకిస్తూ కొత్తవలస బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన శుక్రవారం నిరసన చేపట్టారు. అక్కడి పోలీసులు విచక్షణా రహితంగా న్యాయవాదులపై లాఠీలు ఝుళిపించడాన్ని క్రూరమైన చర్యగా అభివర్ణించారు.



పంట నమోదును పరిశీలిస్తున్న ఎడి, ఎఒ

పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-గజపతినగరం

రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని ఎడి మహారాజన్ తెలిపారు. మండలంలోని శ్రీరంగరాజపురంలో చేపడుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ఎఒ ధనలక్ష్మితో కలిసి ఆయన పరిశీలించారు. మండలంలో ఇప్పటి వరకు 3185 ఎకరాల పంట నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 15లోగా రైతులంతా పంట నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విఎఎ వినయ్ పాల్గొన్నారు .

సచివాలయ భవన నిర్మాణాలు పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సింగరాయి, ఆతవ, వల్లంపూడి, బానాది గ్రామాల్లో శుక్రవారం ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ భవన నిర్మాణాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి రోటరీ క్లబ్ యువజన మాసోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ ఆధ్వర్యంలో ఈనెల 3 నుంచి యువజన మాసోత్సవాలు జరుగుతాయనియూత్ సర్వీస్ డైరెక్టర్ బలభద్రుని అశోక్ అన్నారు. ఈ యువజన మాసోత్సవాల్లో సుమారు 15 వేల మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. శుక్రవారం రోటరీ హెల్త్ సెంటర్ లో జరిగిన విలేకర్ల సమావేశంలో యువజన మాసోత్సవాలు చైర్మన్ శంకర్ రెడ్డి, క్లబ్ అధ్యక్షులు ఉడతా రాజేష్ కార్యదర్శి అరుణ్ సోదాని మాట్లాడారు. 3 నుంచి సాంస్కృతిక క్రీడా సామాజిక కార్యక్రమాలలో విభిన్న పోటీలు నిర్వహించి అక్టోబర్ 2న రోటరీ జిల్లా గవర్నర్ దత్త సుబ్బారావు చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని తెలిపారు.

విద్యార్థుల కంప్యూటర్ కోసం వితరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డాక్టర్ పివిజి రాజు శత జయంతి వేడుకలలో భాగంగా ప్రతి నెలా ఒకటవ తేదీన జరిగే సేవా కార్యక్రమాలలో భాగంగా క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం పేర్ల రామమూర్తి చెట్టి చెవిటి మూగ పాఠశాలలో కంప్యూటర్ కొనుగోలుకు రూ.20వేలు ఆర్థిక సాయంతోపాటు ఐదుగురు విద్యార్థులను వార్షిక దత్తత తీసుకున్నారు. నాలుగెస్సుల రాజు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో సాహితీవేత్త జక్కు రామ కృష్ణ ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. చెవిటి మూగ పిల్లలు ఎదుగుదలకు పాఠశాల చేస్తున్న కృషిని కొనియాడారు.

పోక్సో కేసుల నిరోధానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-రామభద్రపురం

గ్రామాల్లో పోక్షో కేసుల నిరోధానికి మహిళా పోలీసులు కృషి చేయాలని ఎస్ఐ సురేంద్ర నాయుడు ఆదేశించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో దిశయాప్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు మరింత రక్షణ కల్పించాలన్నారు. గ్రామాల్లో మహిళలు మొబైల్ ఫోన్ వాడకం వల్ల నేరాల సమాచారాన్ని దిశ యాప్ ద్వారా చేరవేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. బాలల హక్కులు, చట్టాల పై పాఠశాలల విద్యార్థులకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని సచివాలయాల మహిళా పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ప్రజా సంక్షేమానికి సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని కొండవెలగాడలో వైఎస్‌ఆర్ పింఛను కానుక కింద మంజూరైన 11 కొత్త పింఛన్లను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు పగటి వేషగాళ్లు వచ్చి కల్లబొల్లి మాటలు చెపుతారని, వాటిని నమ్మాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు మొయిద అక్కోజీ, పంచాయతీ కార్యదర్శి యర్ర రమణ, వెల్ఫేర్ అసిస్టెంట్ కె.గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న జెడ్‌పిటిసి సన్యాసినాయుడు

అప్పుల బాధతో కూలీ ఆత్మహత్య

ప్రజాశక్తి - లక్కవరపుకోట

కూలి పనులు చేసుకుని జీవిస్తున్న వ్యక్తి అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రంగాపురం గ్రామంలో శుక్రవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. రంగాపురం గ్రామానికి చెందిన రైతు ఎస్.వెంకటరమణ (56) కుటుంబ అవసరాల మేరకు కొంతమేర అప్పులు చేశారు. వాటిని తీర్చేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో మనస్తాపానికి గురై గ్రామ సమీపంలో ఉన్న మామిడి తోటలో చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు.

వెంకటరమణ భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎఎస్ఐ శ్రీనివాసరావు సంఘటన స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శృంగవరపుకోట ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

పాలసీదారులకు ఎల్ఐసి మెరుగైన సేవలు

ఎల్ఐసి 67వ వారోత్సవాలను ప్రారంభించిన ఎస్‌టి కమిషన్ చైర్మన్



విజయనగరంలో డివిజి శంకరరావును సత్కరిస్తున్న ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పాలసీదారులకు నమ్మకమైన, మెరుగైన సేవలు అందించడంలో ఎల్ఐసి ముందంజలో ఉందని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు అన్నారు. 67వ జీవిత బీమా వారోత్సవాలను శుక్రవారం ఆయన విజయనగరం బ్రాంచ్ కార్యాలయంలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్రావు మాట్లాడుతూ ఒక సేవా సంస్థ మాదిరిగా పాలసీదారుల సంక్షేమం కోసం ఎల్ఐసి నిరంతరం కృషి చేస్తుందని కొనియాడారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో పాలసీదారుల పక్షాన రక్షణ కవచంగా నిలిచి ఎక్కడా ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు అండగా నిలిచిందని చెప్పారు. ఎటువంటి ఆరోపణలకు తావులేకుండా డెత్ క్లైమ్‌లను సకాలంలో పరిష్కరించిన ఘనత ఎల్ఐసి దేనని అన్నారు. అందరి సహకారంతో ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక సంస్థగా గుర్తింపు పొందిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎస్.నారాయణరావు, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ అంజయ్య, ఎఒ కట్టమూరి భాస్కర రామమూర్తి, జీవిత బీమా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి. శ్రీనివాసరావు, సీనియర్ డవలప్ మెంట్ ఆఫీసర్లు జి.రవిశ్రీనివాస్, ఎంఎల్ శ్రీనివాస్, జెవి నాగరాజు , సునీల్ కుమార్ రతో, ఏజెంట్ల సంఘం అధ్యక్షుడు చిల్లా రామకృష్ణ, కార్యదర్శి ఇల్లాపు కృష్ణ పాల్గొన్నారు.

దేశ అభివృద్ధిలో ఎల్ఐసి పాత్ర కీలకం

గరివిడి : దేశ అభిటవృద్ధిలో ఎల్ఐసి భాగస్వామ్యం ఎంతో కీలకమని సీనియర్ బ్రాంచ్ మేనేజర్ విజయశ్రీ అన్నారు. శుక్రవారం ఎల్ఐసి ఆవిర్భావ దినోత్సవ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయశ్రీ, సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ ప్రకాశ్, ఎబిఎన్ రమణమూర్తి, ఎల్ఐసి అధికారుల సంఘం ప్రతినిధి రామారావు, కుసుమకుమారి, డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధి పకీర్ నాయుడు, ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధి సిద్ధార్థ ఏజెంట్ అసోసియేషన్ ప్రతినిధి నడిమింటి సత్యనారాయణ మాట్లాడారు. సామాన్యుల నుంచి సంపన్నుల వరకు జీవిత బీమా అవసరాలకు అనుగుణంగా పాలసీదారుల ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ ఎల్ఐసి సేవలను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఏజెంట్ కామునాయుడు, ఎంప్లాయీస్ యూనియన్ పూర్వ ప్రతినిధి కెఎస్‌ఎన్ మూర్తి పాల్గొన్నారు.



గరివిడి.. జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీనియర్ బ్రాంచ్ మేనేజర్ విజయశ్రీ

సామాన్యుల బతుకు దుర్భరం

మాజీ మంత్రి కోండ్రు

ప్రజాశక్తి-రేగిడి

వైసిపి ప్రభుత్వ హయాంలో సామాన్యుల బతుకులు దుర్భరంగా మారాయని మాజీమంత్రి కోండ్రు మురళీమోహన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఉణుకూరు గ్రామంలో బాబు షూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమర్థవంతమైన పాలన, సంక్షేమం, అభివృద్ధి చేసిన ఘనత టిడిపిదేనన్నారు. సిఎం జగన్ మోహన్ రెడ్డి సైకోపాలనతో ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ ధ్వంసం చేస్తోందని ధ్వజమెత్తారు. విద్యుత్తు ఛార్జీలు, ఇంటి పన్నులు పెంచి, చెత్త ఛార్జీలు వేసి సామాన్యుల బతుకులను దుర్భరం చేశారన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదలను అనేక రకాలుగా మోసం చేస్తూ వారిపై పెనుభారం మోపుతున్నారని మండిపడ్డారు. ఇసుక, మైనింగ్, లిక్కర్, రేషన్ బియ్యం మాఫియా.. ఇలా ఎన్నో అరాచకాలకు పాల్పడుతూ రాష్ట్రాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టారని దుయ్యబట్టారు. గ్రామాభివృద్ధి కోసం రాష్ట్రానికి కేంద్రం కేటాయించిన నిధులను వైసిపి ప్రభుత్వం దారి మళ్లించడంతో పల్లెలు అభివృద్ధికి నోచుకోక కుంటుపడ్డాయన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కిమిడి అశోక్ కుమార్, డిసిసిబి మాజీ వైస్ చైర్మన్ దూబ ధర్మారావు. నాయకులు గురువాన నారాయణరావు, గేదెల బాలమురళీధర్, తదితరులు పాల్గొన్నారు.



భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న పాలవలస గౌరు, పార్వతి

బాబు షూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ

బాడంగి : ప్రజల భవిష్యత్తుకు టిడిపి అధినేత చంద్రబాబునాయుడు హామీ ఇస్తున్నారని ఆ పార్టీ ఎస్‌టి సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాలవలస గౌరు తెలిపారు. మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ ఎరుకులపాకలు గ్రామంలో ఆయన ఆధ్వర్యాన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపగడపకు వెళ్లి గత టిడిపి ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. వాటిని వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. నిధులను దుర్వినియోగం చేస్తోందన్నారు. ఎలాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా ఎస్‌సి, ఎస్‌టిలకు అందడం లేదన్నారు. కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ పాలవలస పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే శంబంగి



ప్రభుత్వ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బాడంగి

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి గ్రామాలను అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి ఉద్దేశమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. మండలంలోని ముగడ, ముగడ కాలనీల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం పర్యటించారు. గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా ఎన్నో పథకాలను తీసుకొచ్చామని తెలిపారు. తాగునీటి కోసం గ్రామస్తులు తన దృష్టికి తేవడంతో సమస్యను పరిష్కరించామని చెప్పారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే వెంటనే సచివాలయ సిబ్బంది తగు చర్యలు తీసికోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాల్, తెంటు మధు, మరిపి శంకర్, జెడ్‌పిటిసి రామారావు, యామలి శివప్రసాద్, తెర్లి నాగభూషణ, తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

తెర్లాం : మండలంలోని బూరిపేట గ్రామానికి చెందిన టి.సాంబారావు కుమార్తె కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. సిఎం సహాయనిధికి దరఖాస్తు చేయగా రూ.2 లక్షలు మంజూరయ్యాయి. రామభద్రపురం మండలంలోని కొండకెంగువ గ్రామానికి చెందిన కోట షణ్ముఖసాయి తేజకి రూ.1.20 లక్షలు మంజూరయ్యాయి. వారికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి బెల్లాన ప్రసాద్, బూరిపేట సర్పంచ్ బూరి మధు పాల్గొన్నారు.

లారీ పరిశ్రమకు స్థలం కేటాయించాలి

బొబ్బిలి : స్థానిక గ్రోత్ సెంటర్లో లారీ పరిశ్రమ యూనిట్‌కు స్థలం కేటాయించాలని బొబ్బిలి లారీ ఓనర్స్, వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.వేణుగోపాల్, జి.భాస్కరరావు.. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొబ్బిలి, పరిసర ప్రాంతాల్లో లారీలపై ఆధారపడి అనేక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. గ్రోత్‌సెంటర్లో లారీ పరిశ్రమ యూనిట్ల ఏర్పాటుకు స్థలం కేటాయిస్తే మరికొంతమందికి ఉపాధి దొరుకుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే శంబంగిని సన్మానించారు.

పింఛను దరఖాస్తుల పరిశీలన

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని నందిగాం సచివాలయంలో వైఎస్‌ఆర్ పింఛను దరఖాస్తులను ఎంపిడిఒ రామకృష్ణ శుక్రవారం పరిశీలించారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ లాగిన్ నుంచి మొత్తం 364 నూతన పింఛన్లకు దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. మొదటిగా ఆగస్టు 22న 149 మంది ధ్రువపత్రాలను పరిశీలన చేసి మంజూరుకు సిఫార్సు చేసినట్లు తెలిపారు.



వేపాడ.. దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంఇఒ

వేపాడ : మండలంలో కొత్తగా పింఛను కోసం వచ్చిన దరఖాస్తులను ఎంఇఒ బాలభాస్కరరావు పరిశీలించారు. కెజిపూడి, పాటూరు, సోంపురంలో దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించారు. పరిశీలనలో కెజిపూడి వెల్ఫేర్ అసిస్టెంట్ కుమారి, పాటూరు, సోంపురం పంచాయతీ కార్యదర్శులు సంధ్య, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

ప్రజాశకి-విజయనగరం టౌన్

ప్రజలు బాగుంటేనే సమాజం బాగుంటుందని, సమాజం బాగుండాలంటే ప్రజలందరూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. జనసేన అధినేత జన్మదిన వేడుకల్లో భాగంగా శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం పట్టణంలో పేర్ల వారి వీధిలో చెవిటి మూగ పాఠశాలలో విద్యార్థులకు పండ్లు, బిస్కెట్ పాకెట్స్ , స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయ్యలు మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన నాయకులు టి.రామకృష్ణ, కాటం అశ్విని, రాజేంద్ర, రవితేజ, పిడుగు సతీష్ తదితరులు పాల్గొన్నారు

మొక్కలు నాటిన యువత

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సింగరాయి గ్రామం నుంచి జగ్గయ్యపేట వరకు రోడ్డుకు ఇరువైపులా శ్రీదుర్గాలమ్మ యువజన సంఘం ఆధ్వర్యాన 10 రకాల మొక్కలు నాటారు. వాటి రక్షణ కోసం కంచె ఏర్పాటు చేశారు. దీంతో యువతను గ్రామస్తులు అభినందించారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులేనా?

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ

ప్రజాశక్తి-వేపాడ

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ప్రతిఒక్కరిపైనా కేసులు పెట్టడం దారుణమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. శుక్రవారం వేపాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. యువగళం పాదయాత్రలో ప్రభుత్వ అవినీతిపై టిడిపి సీనియర్ నాయకులు అయ్యన్నపాత్రుడు ప్రశ్నిస్తే, ఆయనపై కేసులు పెట్టడం, అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. జగన్మోహన్ రెడ్డికి బిసిలపై ఎంత కక్ష ఉందో అర్థమవుతుందన్నారు. ప్రతిపక్షంలో జగన్మోహన్ రెడ్డి ఉన్నప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడిని 'బంగాళాఖాతంలో కలిపేయండి.. తరిమి కొట్టండ'ని అనడమే కాకుండా పరుస పదజాలాలతో దూషించినప్పుడు ఇలాగే కేసులు పెడితే, ఎక్కడ ఉండేవారో అర్థం చేసుకోవాలన్నారు. ఒక్క అవకాశం ఇవ్వండి, అభివృద్ధి చేసి చూపిస్తానంటూ గద్దెనెక్కిన తర్వాత తప్పుడు కేసులు, దాచుకోవడం, దోచుకోవడమే తంతుగా సాగుతోందని ధ్వజమెత్తారు. వైసిపి పాలన ఇంకెంతో కాలం సాగదని, వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

ఖాళీ బిందెలతో మహిళల ధర్నా

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని వెంకటాపుపేటలో గత ఐదు రోజులుగా మంచినీరు రాకపోవడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం గ్రామంలో ఉన్న ఎగువీధి మహిళలు పంచాయతీ కొళాయి వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. నీరు రాకపోవడం వల్ల గ్రామానికి దూరంగా ఉన్న బావుల నుంచి తెచ్చుకుంటున్నామని మహిళలు వాపోయారు. వార్డు సభ్యుడు జుతాడ రామసత్యం మాట్లాడుతూ ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నా పాలకులకు పట్టకపోవడం దారుణమన్నారు. వెంటనే నీటి సౌకర్యం కల్పించాలని కోరారు.

1145 మంది కౌలురైతులకు భరోసా

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి నియోజకవర్గంలో 1144 మంది కౌలురైతులకు రైతు భరోసా బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు వ్యవసాయ శాఖ ఎడి ఎం.శ్యామసుందరరావు చెప్పారు. బొబ్బిలి మండలంలోని 440, రామభద్రపురం మండలంలోని 186, బాడంగి మండలంలోని 265, తెర్లాం మండలంలోని 253 మందికి రైతు భరోసా వర్తించినట్లు తెలిపారు. ఒకొక్క రైతుకు రూ.7,500 చొప్పున 1144 మందికి రూ.85.80 లక్షలు జమైనట్లు చెప్పారు. రెండో విడత రూ.4వేలు, మూడో విడత రూ.2వేలు జమవుతాయన్నారు.



బొబ్బిలి.. బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన నాయకులు

జనసేన ఆధ్వర్యాన బైక్‌ర్యాలీ

ప్రజాశక్తి-బొబ్బిలి

జనసేనతో యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వారోత్సవాలలో భాగంగా శుక్రవారం బొబ్బిలిలో జనసేన కార్యాలయం నుంచి భారీ మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఎస్.గంగాధర్, కిరణ్ కుమార్, సతీష్, ధనుంజయ్ పాల్గొన్నారు.

గజపతినగరం : గజపతినగరంలో జనసేన నియోజకవర్గ నాయకులు మర్రాపు సురేష్ ఆధ్వర్యంలో మెగా బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆదాడ మోహన్‌రావు, డాక్టర్ రవికుమార్, మిడతాన దుర్గ, పరమేశ్వరి, పండు, శ్రీను, మహేష్ పాల్గొన్నారు.

చెరువులను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

చెరువులను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ కోరారు. శుక్రవారం పాతబొబ్బిలి చెరువును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు గట్టుపై మొక్కలు నాటి రక్షణ కోసం కంచె ఏర్పాటు చేయాలన్నారు. చెరువులు, పరిసర ప్రాంతాల్లో వ్యర్థాలు వేయకుండా చూడాలన్నారు. మున్సిపాలిటీలో వైసిపి పాలకవర్గం వచ్చిన తర్వాత రూ.5 కోట్లకు పైగా ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేశామన్నారు. పాతబొబ్బిలిలో రూ.2 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం నిధులు ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. అనంతరం వార్డుల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, కౌన్సిలర్ చోడిగంజి రమేష్, మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, ఎఇ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పన్ను బకాయి చెల్లించాలి

శృంగవరపుకోట : జిల్లాలో పంచాయతీలు వసూలు చేస్తున్న గ్రంథాలయపు పన్నును వెంటనే జిల్లా గ్రంథాలయ సంస్థకు జమ చేయాలని జన జాగృతి సంస్థ ఉత్తరాంధ్ర జిల్లా కన్వీనర్ శీరాపు శ్రీనివాసరావు జిల్లా కలెక్టర్‌ను కోరారు. శుక్రవారం పోతనాపల్లి జంక్షన్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. పంచాయతీలు ఇంటి పన్ను తోపాటు వసూలు చేస్తున్న గ్రంథాలయ పన్ను గత కొన్నేళ్లుగా గ్రంథాలయ సంస్థకు జమ చేయడం లేదని చెప్పారు. ఇదే విషయమై కలెక్టరేట్‌లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీ అందజేసినట్లు వివరించారు.